# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ, వార్డు సచివాలయాలు సహా పలు శాఖలపై ఈరోజు సమీక్ష నిర్వహించనున్నారు.
2. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో అక్రమ రేషన్ బియ్యం రవాణాపై ఈరోజు తనిఖీలను నిర్వహిస్తున్నారు.
3. అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రేపు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేయనున్నారు.
4. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి తెలిపారు.
5. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల రుసుము చెల్లింపు గడువు తేదీని ఇంటర్మీడియట్ విద్యా మండలి పొడిగించింది.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ మధ్యాహ్నం నిర్వహించే సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల పునర్ వ్యవస్థీకరణపై సంబంధిత అధికారులతో చర్చించనున్నారు. అనంతరం స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాల సాధన, కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. అదేవిధంగా ఈ సాయంత్రం రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈరోజు కాకినాడజిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటలో భాగంగా కాకినాడలోని యాంకరేజి నౌకాశ్రయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి తనిఖీలను నిర్వహిస్తున్నారు. కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

--------------------------

ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రేపు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని బొమ్మనహాళ్ మండలం, నేమకల్లు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు

పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాలపై మరిన్ని వివరాలను అనంతపురం జిల్లా ఆకాశవాణి ప్రతినిధి ఎం.మనోహర్ అందజేస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి అమ్మవార్లను కుటుంబసమేతంగా ఈరోజు దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి చేరుకున్న రామ్‌నాథ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయనకు పురోహితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల రామ్‌నాథ్ కోవింద్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజలు సుభిక్షంగా ఉండాలని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్ధించానని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని వైయస్సార్ జిల్లాలో గల గండికోటను పర్యాటక ప్రదేశంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 78 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన నిధులతో పెన్నా నది ఒడ్డున ఉన్న గండికోటను 'గ్రాండ్ కేన్యన్ ఆఫ్ ఇండియా'గా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తద్వారా రాయలసీమలో పర్యాటక రంగాన్ని మెరుగుపరిచి, స్థానికులకు గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పించనున్నామని వివరించారు.

---------------------------

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 1.75 కోట్ల రూపాయలతో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలికల వసతి భవనాన్ని ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి 2 వేల 500 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో డోలి మోతలు నివారణకు వైద్య ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు పోషకాహారంతో పాటు మౌలిక వసతులను కల్పిస్తున్నామని అన్నారు.

---------------------------

తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమల వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం హైదరాబాదు, కాచిగూడ నుంచి కొట్టాయం వరకువచ్చే నెల 3 నుంచి 18 ప్రత్యేక రైళ్ళు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్ళు డిసెంబరు 3, 10,17, 24, 31తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి బేగంపేట, వికారాబాదు, తాండూరు, రాయచూర్, గుంతకల్లు, రాజంపేట, రేణిగుంట, పాల్‌కాడ్, ఎర్నాకులంటౌన్ మీదుగా కొట్టాయానికి చేరుకుంటాయని తెలిపారు.

---------------------------

కృష్ణాజిల్లా ఉయ్యూరుకి చెందిన శిరీషా మానసిక వికలాంగ కేంద్రానికి జాతీయ స్థాయిలో ఇండియన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ– సీఎస్ఆర్ పురస్కారం లభించింది. ఎన్జీవోస్ ఆఫ్ ది ఇయర్–2024 పేరుతో ఈ పురస్కారాన్ని ప్రకటించారు. అవార్డుల ఎంపిక కోసం ప్రత్యేక పరిశీలక బృందం.. దేశ వ్యాప్తంగా 200

స్వచ్ఛంద సంస్థల సేవలను పరిశీలించి వాటిలో పది సంస్థలను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ రోజు ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో మానసిక కేంద్రం వ్యవస్థాపకులు, ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మన్నే సోమేశ్వరరావు ఈ పురస్కారం అందుకుంటారు.

---------------------------

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల రుసుము చెల్లింపు గడువును వచ్చే నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కృతికశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుమూ లేకుండా చెల్లించేందుకు ఈ అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం 'ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్' –ఈగల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని 'ఈగల్' ముఖ్య అధికారి ఇన్స్‌పెక్టర్ జనరల్ రవికృష్ణ తెలిపారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ (31 సెకన్లు)

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వచ్చే నెల 4వ తేదీన రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. మంత్రివర్గంలో చర్చించాల్సిన ప్రతిపాదనల్ని వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోపు సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాలని అన్ని శాఖల్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

తిరుపతి పాస్ పోర్ట్ సేవా కేంద్రం ద్వారా ప్రతి నెలా 500మందికి పాస్ పోర్ట్‌లను అందిస్తున్నామని విజయవాడ ప్రాంత పాస్ పోర్ట్ అధికారి కె.శివహర్ష తెలిపారుతిరుపతిలోని పాస్ పోర్ట్ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయచిత్రాల ప్రదర్శనను శ్రీవెంకటేశ్వర జంతుప్రదర్శనశాల క్యూరేటర్ సెల్వంతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా శివహర్ష మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లను రేపు శ్రీకాకుళం జిల్లాలో పంపిణీ చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు పి. కిరణ్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వచ్చే నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందస్తుగా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.. శ్రీకాకుళం జిల్లాలోమూడు లక్షల 18 వేల మంది పింఛన్ దారులు ఉన్నారని, పించన్లు పంపిణీలో ఆరువేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో వచ్చే నెల 21 నుంచి 25వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు తెలిపారు. భవానీ దీక్షల విరమణకు సంబంధించిన ఏర్పాట్లను నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దీక్ష విరమణలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భవానీభక్తుల కోసం క్యూలైన్లు, జల్లు స్నానాలు, ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భవానీ దీక్షల విరమణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

======================